

# చెప్పులో రాయి

## నెమలూరి భాస్కరరావు

సుబ్బారావు నిక్కచ్చైన మనిషి అనుకుంటారందరూ. బ్రతకనేర్చిన వాడనికూడా ప్రతీతి. అతనో చిన్న కిరాణాదుకాణం యజమాని. కొట్టు చిన్నదే అయినా సుబ్బారావు బుర్ర పెద్దది. అతని వ్యాపార సరళి, ప్రపంచానుభవం పెద్దవి ధనం విలువ గుర్తించిన వాడనికానీ, పీనాసనికానీ. రెండింటిలో ఏదయినా అనుకోవచ్చు. అతను ప్రతిపైసను జాగ్రత్తగా కూడబెడతాడు. అలాగే ఖర్చుపెడతాడు. ఇంత పీనాసి అనుకునే సుబ్బారావు దుస్తుల విషయంలో మడత చెరగనివ్వకుండా నీట్‌గా వుంటాడు. సినిమాలు చూస్తాడు, సిగరెట్లు త్రాగుతాడు – విపరీతంగా మాత్రంగాదు. సుబ్బారావు కథలు చదువుతాడు – కామెంటు చేస్తాడు. ఆవగింజ దగ్గర్నుంచి, అణువువరకూ తెలిసినట్లే ధారాళంగా మాట్లాడగలడు. ఇది అతన్నిగురించి ఉపోద్ఘాతం.

సుబ్బారావు దుకాణంలో కూర్చుని బజార్నపోయే జనాన్ని తిలకిస్తున్నాడు. అతని ముందున్న చిన్న తాటాకు చాప మీది బెల్లం అచ్చుమీద ఈగలు జుంయ్‌మని వాల్తున్నాయి. సుబ్బారావుకి విసుగ్గా వుంది – చిరాగ్గానూ వుంది. అందుక్కారణం అంతకుముందు గంటసేపటినుంచి బేరగాళ్ళెవరూ రాకపోవటమే. పైగా ఆ రోజు శనివారం. ఆ బజారులో ఉన్న చాలా దుకాణాలకు ఆ రోజు శలవుదినం.

బేరం పెరగాల్సిందిపోయి దల్గా వుందేమో అని ఆలోచిస్తున్నాడతను. ఆలోచనలనుండి చటుక్కున తేరుకుని "రా! వీరయ్యా! రా! ఏం ఈ మధ్య అసలు కనపడటంలేదు?" అంటూ ఆహ్వానించాడు అప్పుడే చేతిసంచితో దగ్గరకు సమీపించిన ఓ ముసలాయన్ని.

"ఏం కనపడతాం బాబూ. ధరలు చూడొస్తే మండిపోతున్నాయి. ఎనకటి రోజుల్లో రూపాయి సరుకులు కొంటే బండిమీదేసు కెళ్ళాల్సొచ్చేది" అంటూ అక్కడే వున్న జాజికక్కల పెట్టిమీద కూర్చుంటూ చేతిలోవున్న చీటీ సుబ్బారావు కందించి, నూనెసీసాలు ప్రక్కనే వున్న వుప్పుతొట్టిలో పెట్టాడు.

"ధరలు పెరగటం వక్కటే కారణం కాదు వీరయ్యా! డబ్బు విలువకూడా చచ్చిపోయింది. పూర్వం నువ్వు బండి కడితే స్టేషన్నుంచి వూళ్ళోకి బేడా ఇచ్చేవాళ్ళు ఇప్పుడు రూపాయిన్నర ఇస్తున్నారాలేదా?" అంటూ పొట్లాలు కట్టడం ముగించి, చీటీమీద ధరలువేసి కూడిక ప్రారంభించాడు.

"అవును గానీ, పాత చింతపండుందా?"

"అరెరే. ఇందాకనే ఓ మణుగుంటే అమ్మేశాను. కొత్తపండుంది తీసుకెళ్ళు. బంగారంలాంటి సరుకంటే నమ్ము" అంటూ చింతపండుకూడా తూచి పొట్లం కట్టాడు సుబ్బారావు.

"మొత్తం ఎంత అయింది?"

"ఐదురూపాయల ఎనభైపైసలు."

"ఓ పదిపైసలు తక్కువయింది. రేపు తెచ్చిస్తాను బాబూ!" అంటూనే డబ్బులు త్రాసు పళ్ళెంలో పోశాడు వీరయ్య.

"చూడు వీరయ్యా. ఓ మాట చెపుతాను ఏమనుకోకు. వెధవది పదిపైసలు, ఐదుపైసలు అప్పుపెడితే నీకూ గుర్తుండదు. నాకూ గుర్తుండదు. పదిమంది పదిపదులు అప్పుపెడితే నాకు రూపాయి నష్టం. ఇంతా ఏదిస్తేనా కొచ్చేలాభం రూపాయికి అయిదుపైసలు."

"ఇంతా ఇచ్చినవాడిని పదిపైసలు వుంటే అప్పుపెడతానా? లేవుబాబూ! రేపు ప్రొద్దునే తెచ్చి యిస్తానుగా" అన్నాడు వీరయ్య.

"వ్యాపారం అన్నాక వ్యాపారమే వీరయ్యా! ఇంత బాధెందుకు చెప్పు. ఓ పదిపైసల సరుకులు తగ్గించి తీసుకుంటే నీకూ ఇబ్బందిలేదు, నాకూలేదు." అంటూనే పొట్లం వూడతీసి ఓ గుప్పెడు మిరపకాయలు తనప్రక్కనే వున్న డబ్బాలో పోసుకున్నాడు సుబ్బారావు. వీరయ్య మాట్లాడకుండా సరుకులు సంచిలో సర్దుకోసాగాడు.

"పాపం! పెద్దవాడి వయిపోయావ్ వీరయ్యా!" అని ఇంకా ఏదో అనబోతున్నాడు సుబ్బారావు. వీరయ్య సంచీతో సహా వెళ్ళిపోయాడు.

"వెధవలు. ప్రతివాడికీ ఇదొకటి అలవాటయిపోయింది. పదిపైసలో, అయిదో అప్పుపెట్టటం. అడక్కపోతే ఎగ్గొట్టటం" కసిగా అనుకున్నాడు సుబ్బారావు.

* * *

ఆ మర్నాడు ఆదివారం సుబ్బారావు దుకాణానికి శలవు. మధ్యాహ్నం భోజనం చేసి, ఇస్త్రీగుడ్డలు వేసుకుని, ఏదో పర్మిట్ విషయం తహసీల్దారుగారితో మాట్లాడేందుకు బయల్దేరాడు సుబ్బారావు. వేసవికాలపు మండుటెండ చిటపటలాడుతోంది. హుషారుగా సిగరెట్ ముట్టించి నడకసాగించాడు సుబ్బారావు. తహసీల్దారుగారిల్లు నాలుఫర్లాంగుల దూరాన వుంది. నడుస్తున్న సుబ్బారావు హఠాత్తుగా ఆగిపోయి కాళ్ళకేసి చూసుకున్నాడు. ఎడంకాలి చెప్పు వుంగటం తెగిపోయి ఓ మూలకు వ్రేలాడుతూ కనిపించింది. సుబ్బారావు హుషారంతా నీరు కారిపోయింది. కాలితోనే చెప్పును ఈడ్చుకుంటూ తీసుకువెళ్ళి రోడ్డు ప్రక్కన చింతచెట్టుక్రింద కూర్చున్న చెప్పులుకుట్టే వానిముందు పడవేశాడు.

"పదిపైసలవుతుంది బాబూ!" తెగిపోయిన సుబ్బారావుచెప్పు చేతిలోకి తీసుకుంటూ అన్నాడు అతను. "సరే కానీయ్" అన్నాడు సుబ్బారావు. అతను పని ప్రారంభించాడు. చెప్పులేని ఎడంకాలు భూమిమీద వేడిగా కాలుతోంది. సుబ్బారావు విసుగ్గా ఫీలయ్యాడు. కాసేపటికి

"తొడుక్కోండి బాబూ!" అంటూ చెప్పును కాలిముందు పెట్టాడతను. సుబ్బారావు చెప్పుతొడుక్కుంటూనే ప్యాంట్ జేబులో పర్సుకోసం చెయ్యిపెట్టి ఆశ్చర్యపోయాడు. పర్సులేదు! అప్పుడుగానీ గుర్తుకు రాలేదతనికి, మనీపర్సు తనింటి దగ్గర విడిచేసిన ప్యాంటు జేబులోవున్నట్లు. బిక్కచచ్చిపోయాడు సుబ్బారావు. సిగ్గుపడుతూనే జరిగిన సంగతంతా చెప్పాడతనికి. సాయంకాలం తీసుకువచ్చి ఇస్తానన్నాడు పదిపైసలు.

"పోన్లెండి బాబూ! పొరపాట్లు అందరికీ జరుగుతాయి. సాయంకాలమే ఇవ్వండి ఫరవాలేదు," అన్నాడు అతను తిరిగి తనపనిలో లీనమయిపోతూ. రోడ్డుమీద తిరిగి నడకప్రారంభించిన సుబ్బారావు, ఎదురుగా వస్తున్న వీరయ్యను చూసి తలవంచుకున్నాడు. చెప్పులుకుట్టేవాడు తనుపెట్టిన బాకీకి వప్పుకోకపోతే బాగుండును అనిపించింది సుబ్బారావుకు. రాయిలేకున్నా, చెప్పులో రాయిమారినట్టే అయిందతనికి.